చిట్టి కథ

# నిజాయితీ

"అమ్మగారూ! పనైపోయినాది. తలుపు వేసుకోండి" అన్న పనిమనిషి పైడి మాటలకు బద్ధకంగా లేచి తలుపు గెడవేసి వచ్చింది లలిత. టేబిల్ మీద గడియారం ఉదయం 5-30 చూపించింది.

"పర్వాలేదు. ఇంకో గంట పడుకోవచ్చు" అనుకుంటూ లైట్ తీయబోయిన లలిత కళ్ళు కిటికీలో ఉన్న వస్తువుపై పడ్డాయి. అది మిలమిలా మెరుస్తున్న స్టీలు గిన్నె. గబగబా దగ్గరకు వెళ్ళి చూసింది. కొత్తది కావడం వలన అద్దంలా మెరుస్తూంది. కె. ఆర్. ఆర్ అని ఇంగ్లీషులో అక్షరాలు ఉన్నాయి దానిపై. చూడడానికి చాలా ముచ్చటగా ఉంది. చాలా బరువుగా కూడా ఉంది. "ఎవరో అన్నం పెట్టి పైడికి ఇచ్చి ఉంటారు. అది ఇక్కడ పెట్టి మర్చిపోయి ఉంటుంది." అనుకుంటూ గిన్నె కిటికీలో మూలగా పెట్టి వెళ్ళి పడుకుంది. లలిత మనస్సంతా ఆ గిన్నె మీదే ఉంది. ఆమె ఆలోచనలన్నీ ఆ గిన్నె చుట్టూ తిరుగుతున్నాయి.

"చాలా చక్కగా ఉంది. నేను కూడా ఇలాంటిది కొనాలి" అనుకుంటూ ఆలోచనలతో గడిపేసింది.

సాయంత్రం నాలుగు గంటలకు పైడి పనిలోకి వచ్చింది. కాని ఆ గిన్నె తీసుకెళ్ళలేదు. రెండు రోజులు గడిచినా ఆ గిన్నె తీసుకెళ్ళడం గాని, అడగటం కాని జరగలేదు. దానితో లలితలో దురాలోచన చోటు చేసుకుంది. వెంటనే ఆ గిన్నె తీసి తమ బీరువాలో పెట్టి తాళం వేసింది. అది తప్పని మనసు గోల చేసినా వారం రోజులు గడిచినా పైడి అడగకపోవడంతో ఆమె మనసు శాంతించింది. కొన్ని రోజులు గడిచాయి. ఒక రోజు పైడి ఏడుస్తూ వచ్చింది.

"ఏమైందే" ఆదుర్దాగా అడిగింది లలిత.

"ఆ పక్క వీధోళ్ళు నన్ను బాగా తిట్టి తరిమేశారు."

"దేనికి?"

"ఆ అమ్మ ఎపుడో అన్నం పెట్టిన స్టీల్ గిన్నె ఇచ్చింది. అసలే మతి మరుపుదాన్ని. ఏడపడేసినానో.



అది పోయిందని చెబితే దొంగదాన్ని అని పనిలో నుంచి తీసేశారు. నెల జీతం కూడా ఈయలేదు."

ఆ మాటలకు గతుక్కుమని "సరేలే వెళ్ళి అంట్లుతోము" అంటూ లోనికెళ్ళింది లలిత. అంట్లుతోమి బట్టలుతుకుతున్న పైడి పరుగెత్తుకుంటూ వచ్చి—

"అమ్మగారూ! అమ్మగారూ!" అన్నది.

"ఏమైందే" విసుగ్గా అంది లలిత.

"మరి ...మరి అయ్యగారి షర్టు జేబులో ఇది ఉంది" అంటూ ఉంగరం తీసి ఇచ్చింది.

"నాదే. నిన్న రాయి ఊడిపోతే సరిచేయించుకు రమ్మని ఆయనకు ఇచ్చాను. అయ్యో మర్చిపోయి అలాగే ఉంచారు కాబోలు" అంటూ ఉంగరం తీసుకున్న లలిత పైడి నిజాయితీకి విస్మయం పొంది తాను చేసిన పాడుపని గుర్తుకురాగా పశ్చాత్తాపంతో దహిస్తున్న హృదయంతో ఎటూ చెప్పలేక అలా వుండిపోయింది!

—ఎ. లక్ష్మి